సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ׀ 30 ׀ మే ׀ 2025



12 గంటలు సోదాలు

ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణను ఏసీబీ అరెస్టు చేసిన విషయంలో 12 గంటల పాటు విచారణ కొనసాగింది. 8లో▸



రైతుబజార్ వేలం

జల్‌పల్లి మున్సిపాలిటీ రైతుబజార్ వేలంలో రూ.11,03,500కు పలికింది. మున్సిపల్ కమిషనర్ సమక్షంలో వేలం జరిగింది. 8లో▸



షార్ట్ సర్క్యూట్‌తో..

షార్ట్ సర్క్యూట్‌తో ఓ హోటల్ దగ్ధమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

విజయలక్ష్మికి నివాళి

కేశంపేట: ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు విజయలక్ష్మి అలియాస్ భూమిక సంతాప సభను కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి ఆత్మకు శాంతి కలగలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నర్సింలుగౌడ్, శివగౌడ్, సాయికిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఖర్జూర, ఈత మొక్కల పంపిణీ



ఆమనగల్లు: వన మహోత్సవంలో భాగంగా గీత కార్మికులకు ఈత, ఖర్జూర మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవంలో భాగంగా నాటేందుకు ఈత, ఖర్జూర మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గీత కార్మికులతో పాటు ఆసక్తిగల రైతులు పెంచుకోవచ్చని సూచించారు. ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు, గీత కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖర్జూర మొక్కలు కావాల్సిన రైతులు, గీత కార్మికులు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

పంటలకు కనీస మద్దతు అభినందనీయం



నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మహేశ్వరం: రైతు సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో వాజ్‌పేయ్ వ్యవసాయ క్షేత్రంలో గురువారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఇటీవల కేబినెట్‌లో 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినందుకు ప్రధాని మోదీ చిత్రపటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రైతులు పండిస్తున్న 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్కా రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిలో కరోనా ఐసోలేషన్ వార్డు

అఫ్జల్‌గంజ్: కరోనా మళ్లీ విజృంభిస్తోందన్న వదంతుల నేపథ్యంలో ఉస్మానియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామని, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ తెలిపారు. కరోనా రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అవసరమైన మాస్కులు, పీపీఈ కిట్లు, వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు కరోనా పట్ల ఆందోళన చెందకుండా జాగ్రత్తలు పాటించాలని రాకేష్ సహాయ్ సూచించారు.

అడుగులోతులో.. అక్రమాలు!

ప్రైవేటు కాంట్రాక్టర్లతో ఇంజనీర్ల కుమ్మక్కు

- అంచనాలకు భిన్నంగా యూజీ కేబుల్ పనులు
- తవ్వకాల్లో బయటపడుతున్న లోపాలు
- తరచూ వెలుగు చూస్తున్న షార్ట్ సర్క్యూట్‌లు



పుప్పాల్‌గూడలో ట్రెంచ్ తవ్వకుండా భూమిపై నుంచే పరిచిన కేబుళ్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్‌లో భూగర్భ కేబుళ్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. అంచనాలకు భిన్నంగా పనులు చేయడంతో పాటు ప్రతిపాదిత మార్గానికి భిన్నంగా లైన్లు తవ్వుతుండటం.. నిర్దేశిత ప్రమాణాలకు భిన్నమైన కేబుళ్లు, విద్యుత్ పరికరాలు వాడుతుండడంతో లైన్లు వేసిన కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా ఐటీ, అనుబంధ కంపెనీలకు, భారీ గృహ, వాణిజ్య సముదాయాలకు నిలయమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో చేపడుతున్న భూగర్భ కేబుల్ (యూజీ) పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు కాంట్రాక్టర్లతో ఇంజనీర్లు కుమ్మక్కై.. ఆయా రియల్ ఎస్టేట్ డెవలపర్స్, వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. వాస్తవ ఖర్చుకు భిన్నంగా అంచనాలు రూపొందించడంతో పాటు అడ్డగోలుగా లైన్లు వేస్తున్నారు. నాసిరకం పనులు చేపడుతుండటంతో వేసిన కొద్ది రోజులకే ఆయా లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే కాన్సులేట్ కార్యాలయానికి చేపట్టిన యూజీ కేబుల్ పనులు సహా కొండాపూర్, ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, కందుకూరు, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, మేడ్చల్, జీడిమెట్ల, హబ్సిగూడ డివిజన్ల పరిధిలో చేపడుతున్న యూజీ కేబుల్ పనులను ×కేబుల్ టెస్టింగ్ వ్యాన్ల ద్వారా తనిఖీ చేపడితే అక్రమాలన్నీ బయటపడే అవకాశం ఉంది.

ఓ డెవలపర్స్‌కు నోటీసులు

పుప్పాల్‌గూడ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ ప్రైవేటు డెవలపర్స్ సంస్థ రెండేళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకుంది. డిస్కం ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు రూపొందించారు. సదరు సంస్థకు 9,951 కిలో వాట్స్ సామర్థ్యంతో కూడిన డిమాండ్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి భూగర్భ కేబుల్ లైన్ వేసుకోవాల్సిందిగా సూచించి, ఆ మేరకు ఏ సబ్‌స్టేషన్ నుంచి ఏ మార్గంలో లైను వేయాలి? ఎన్ని అడుగుల లోతు తవ్వాలి? ఎంత సామర్థ్యంతో కూడిన కేబుల్ వేయాలి? కేబుల్ రక్షణ కోసం ఎంత పరిమాణంలో ఇసుక పోయాలి? కేబుళ్లపై ఏ సైజులో ఉన్న షాబాద్ బండలు పరచాలి? వంటి అన్ని అంశాలను ఎస్టిమేషన్‌లో పొందుపర్చారు. పనులు దక్కించుకున్న ప్రైవేటు కాంట్రాక్టర్ అంచనాలకు భిన్నంగా కేబుల్ పనులు చేసినట్లు గుర్తించారు. నిజానికి 1.5 మీటర్ల లోతులో వేయాల్సిన కేబుళ్లను భూమిపైనే పరిచ్చారు. కేబుల్ కింది భాగంలో 50 ఎంఎం, పై భాగంలో 250 ఎంఎం మందం ఇసుక పోయాలి. ఆర్వాత కేబుల్‌కు రక్షణగా 40 ఎంఎం షాబాద్ బండలు అమర్చాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ పూర్తి నాసిరకంగా పనులు చేపట్టినట్లు గుర్తించారు. అంతేకాదు అధికారులు సూచించిన ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతం నుంచి ట్రెంచ్ తవ్వినట్లు నిర్ధారించారు. కేబుళ్ల మధ్య ప్రతి మూడు మీటర్లకు ఇటుకలతో హారిజంటల్ లైన్ ఏర్పాటు చేయాలి. సదరు కాంట్రాక్టర్ ఇవేవీ పట్టించుకోలేదు. నాసిరకం పనులతో తరచూ కేబుళ్లు దెబ్బతినడం, విద్యుత్ లీకేజీ సహా షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తి ఆయా భవన సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు ప్రమాదవశాత్తు లైను మీదుగా వెళ్లేవారు షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదానికి గురై మృతి చెందే అవకాశం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ పనులను నిలిపివేయాల్సిందిగా ఇప్పటికే డిస్కం సదరు డెవలపర్స్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ఆ భవనాలకు కుచ్చుటోపీ

భూగర్భ కేబుల్ కాంట్రాక్టర్లు అదే ప్రాంతంలోని ఓ ప్రముఖ ఆస్పత్రి సహా బ్యాంకు, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలను మోసం చేశారు. ఆర్సీపురం 130 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఓ బ్యాంకు కోసం వేసిన భూగర్భ కేబుల్ లైన్ పనులు అంచనాలకు భిన్నంగా ఉన్నట్లు తెలిసింది. ఏకంగా 55 శాతం లెస్‌తో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆ తర్వాత క్షేత్రస్థాయి ఇంజనీర్లతో కుమ్మక్కై..రివర్స్ టెండరింగ్ పేరుతో భారీ మోసానికి పాల్పడినట్లు సమాచారం. అదే విధంగా ఓ ప్రముఖ బహుళ అంతస్తుల భవనం సహా ఆస్పత్రి లైన్లను కూడా అంచనాలకు భిన్నంగా వేశారు. రెండు సంస్థల నుంచి వేర్వేరు చార్జీలు వసూలు చేసి, సింగిల్ ట్రెంచ్ నుంచే కేబుల్స్ వేశారు. యూజీ కేబుల్ లైన్లపై దరఖాస్తుదారులకు కానీ, డెవెలపర్లకు కానీ సరైన అవగాహన లేకపోవడం కూడా కాంట్రాక్టర్లకు కలిసి వస్తోంది. భూగర్భ కేబుల్ పనులన్నీ ప్రైవేటు కాంట్రాక్టర్లే చేస్తున్నప్పటికీ.. ఆయా పనులను సంబంధిత డివిజన్ ఇంజనీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తి పడి వారు నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. తీరా పనులు పూర్తయిన తర్వాత కేబుళ్లు భూమిపై తేలి కన్పిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఏదో ఒక పేరుతో ఆయా మార్గాల్లో తరచూ తవ్వకాలు చేపడుతుండటం.. కేబుల్ లైన్లపై ఎలాంటి హెచ్చరికల బోర్డులు లేకపోవడం.. భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో వేసిన కొద్ది రోజులకే కేబుళ్లు దెబ్బతింటున్నాయి. షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తి ఆయా సంస్థలకు సరఫరా నిలిచిపోతోంది. విషయం తెలియక ఆయా భవనాల్లోని వినియోగదారులు ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా డిస్కంపై తప్పుడు ప్రచారానికి దిగుతున్నారు. ఇటీవల ఈ తరహా ఫిర్యాదులనే డిస్కం ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తోంది.



కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న సబితారెడ్డి తదితరులు

ఫ్యూచరా.. ఫార్మానా..?

- ప్రభుత్వం స్పష్టతనివ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యూచర్ సిటీనా లేక ఫోర్త్ సిటీనా ఫార్మాసిటీనా అనేదానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి క్లారిటీ లేదని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఫార్మాసిటీతో పాటు జిల్లాలోని వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మా కోసం 14వేల ఎకరాల భూములు సేకరించిందని గుర్తు చేశారు. రైతులకు మంచి పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలన్నారు. పొజిషన్‌లో ఉండి కాగితాలు లేని రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. పట్టా భూములు సేకరించిన రైతులకు నేటికీ పరిహారం ఇవ్వలేదని, కలెక్టర్‌ను అడిగితే కోర్టులో జమ చేశామని చెబుతున్నారని వెంటనే ఆ సమస్య తీర్చాలన్నారు. లేదంటే రైతులకు పట్టా భూములు విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. కబ్జాలో ఉన్న రైతులకు కూడా న్యాయం చేయాలన్నారు. చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారు తప్ప పరిహారం ఇవ్వడం లేదన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని పనులు చేస్తే ఊరుకోబోమని, బలవంతంగా భూసేకరణ చేస్తే సహించబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే ఫార్మా రద్దు చేస్తాం, మీ భూములు మీకిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వెంటనే భూములను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గున్రంగూడ భూసేకరణ సందర్భంగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ పొజిషనల్ చూపడం లేదన్నారు.

కాంగ్రెస్‌ది రెండు నాల్కల ధోరణి

ఫార్మా విషయంలో కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. కోర్టుల్లో ఫార్మా అని ప్రభుత్వం సమర్పించి రైతులకు, ప్రజలకు మాత్రం ఫోర్త్ సిటీ అని చెప్పడం రెండు నాల్కల ధోరణి కాదా అని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వకుండానే రోడ్డు ప్రారంభించడం తగదన్నారు. పరిహారం విషయంలో చాలా మందికి అన్యాయం జరిగిందన్నారు. రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. రైతులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌గౌడ్, బాష, రామిడి రాంరెడ్డి, ప్రభాకర్, రాజు నాయక్, గోవర్ధన్‌నాయక్, శేఖర్ గుప్తా, గున్రం సాయికిరణ్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, రమష్, శ్రీధర్‌రెడ్డి, అబీబుద్దీన్, బుగ్గరాములు పాల్గొన్నారు.

ఠాణా ఎదుట మహిళ హల్‌చల్

- చచ్చిపోతా అంటూ హైడ్రామా
- సంచిలోంచి డబ్బాతీసి ఒంటిమీద పోసుకున్న మహిళ
- నీళ్లు అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



కంటతడి పెడుతున్న మహిళ

ఇబ్రహీంపట్నం రూరల్: 'నేను చచ్చిపోతేనే న్యాయం జరుగుతుంది.. ఎవరి వద్దకు వెళ్లినా ప్రయోజనం లేదు.. అధికారులెవరూ న్యాయం చేయడం లేదు' అంటూ ఓ మహిళ ఆదిబట్ల ఠాణా ఎదుట హల్‌చల్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా మూలమడ్గా తండా యోట్టం ప్రాంతానికి చెందిన కేతావత్ బుజ్జి, రామ్‌సింగ్ దంపతులు. 2021లో కుర్మల్‌గూడలో 100 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేశారు. బడంగ్‌పేట్ మున్సిపాలిటీ అనుమతులతో ఇంటి నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు ఉందని అక్కడ ఉన్న 20కిపైగా నిర్మాణాలను స్థానిక రెవెన్యూ అధికారులు ఏడాది క్రితం కూల్చివేశారు. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మీకు ప్లాటు అమ్మిన వారి మీద కేసు పెట్టండి అని ఆర్డీఓ చెప్పడంతో పలుమార్లు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం బుజ్జి తన భర్త రామ్‌సింగ్ చంటి బిడ్డతో కలిసి వచ్చింది. తనకు ఒక్కతే కూతురు అని, ఆమె కోసమే రూ.లక్షలు పెట్టి ప్లాటు కొనుగోలు చేశామని పేర్కొంది. తనకు కిడ్నీ సమస్య ఉందని, తిరగలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం జరగడం లేదు.. చచ్చిపోతా అంటూ తన సంచిలో ఉన్న డబ్బా తీసి ఒంటిపై పోసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాక్కొని పడేశారు. తర్వాత అవి నీళ్లు అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్ కలగజేసుకుని సర్దిచెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే వేడుకలపై శాఖల వారీగా దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని అన్నారు. స్టేజీని పూలతో అందంగా అలంకరించాలని ఉద్యాన వన శాఖ అధికారులను ఆదేశించారు. సిట్టింగ్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకల్లో బందోబస్తుపై పోలీసు అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓకు చెప్పారు. వేడుకల్లో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కబ్జా ఫిర్యాదుపై కదిలిన హైడ్రా

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ సర్వే నంబర్ 639లో ఓ వ్యక్తి భూమిని కబ్జా చేసి మడిగెలు నిర్మించాడని ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో హైడ్రా అధికారుల బృందం గురువారం నిర్మాణాన్ని పరిశీలించింది. నిర్మాణదారుడు అందుబాటులో లేకపోవడంతో డాక్యుమెంట్‌లు తీసుకుని హైడ్రా కార్యాలయానికి రావాలని పిలిచినట్లు సమాచారం. డాక్యుమెంట్‌లను పరిశీలించిన అనంతరం, సర్వే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

చెరువులోకి చేరేదెన్నడో!

- చేప పిల్లల పంపిణీపై నీలినీడలు
- నేటికీ ఊసే లేని టెండర్ల ప్రక్రియ
- ఆదేశాలు రాలేదంటున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

షాద్‌నగర్: వర్షాకాలంలో నిండిన చెరువులతో రైతులు సాగుబాట పడితే.. అవే చెరువులను మత్స్యకారులు జీవనోపాధిగా మలుచుకుంటున్నారు. మత్స్యకారుల ఉపాధిని ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఊసేలేదు. దీంతో ఈసారి చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని 27 మండలాల్లో మొత్తం నీటి వనరులున్న చెరువులు, కుంటలు వెయ్యి వరకు ఉన్నాయి. వీటి విస్తీర్ణం సుమారు 15వేల హెక్టార్ల వరకు ఉంటుంది. జిల్లాలో 210 పైగా మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మత్స్యకారులు 10వేల మంది, మత్స్యకార వృత్తిపై సుమారు 15వేల మంది చేపలు పట్టడం, వాటిని విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. 2016–17లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. గత ఏడాది చేప పిల్లల పంపిణీ కోసం రూ.93 లక్షలు కేటాయించి అక్టోబర్‌లో సుమారు 400 చెరువుల్లో మాత్రమే చేపపిల్లలను వదిలారు. గత ప్రభుత్వ హయంలో మత్స్యశాఖపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రస్తుతం చేప పిల్లల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది.



చేప పిల్లలు

ఊసేలేని టెండర్ ప్రక్రియ

ప్రతి ఏడాది మేలోనే చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం టెండర్లను పిలిచేది. వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరితే ఆగస్టులో మత్స్యకారులకు ఆ శాఖ అధికారులు వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా నేటికీ చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చేప పిల్లల కొనుగోలుకు టెండర్ పిలవాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు వర్షాలు

ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా రావడంతో వర్షాలు ప్రారంభం అయ్యాయి. జలాశయాల్లో నీరు చేరే సమయానికి ఉచిత చేప పిల్లలను వదిలే అవకాశం ఉంటుందో లేదో అన్నది అనుమానంగా ఉంది. ఈ ఏడాది నేటికీ చేప పిల్లల టెండర్ ప్రక్రియ మొదలు కాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఏటా జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలలో చేప పిల్లల పంపిణీ జరిగేది. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటాయి. ఆ సమయంలో చేప పిల్లలు వదిలితే అవి చక్కగా ఎదిగేందుకు అవకాశం ఉండడంతో పాటు ఎదిగిన చేపల విక్రయాల ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి జరుగుతుంది. ఆలస్యం చేస్తే చేపలు ఎదగడం కష్టంగా మారుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారని, దీంతో చేప పిల్లలు సరిగా ఎదగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జీవన ప్రమాణం మెరుగు



చేపల పెంపకం ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. మత్స్యకారుల జీవన ప్రమాణం మెరుగుపడుతుంది.

– మొగులయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, వీరన్నపేట

చర్యలు తీసుకోవాలి



వర్షాకాలం ప్రారంభమైంది. ఈసారి చెరువుల్లో త్వరగా నీరు వచ్చే అవకాశాలున్నాయి. ఉచిత చేప పిల్లల పంపిణీ చేయాలి. టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.

– గుండు సురేష్, అధ్యక్షుడు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం, గూడూరు

ఆదేశాలు వచ్చిన వెంటనే..



చేప పిల్లల పంపిణీపై ఉన్నతాధికారుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపడతాం.

– పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారిణి



సభ సక్సెస్!

టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం బాచుపల్లి వీఎన్ఆర్ జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు జైహింద్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి

చేవెళ్లలో ఘటన
- విజయ్ నర్సింగ్‌హోం ఎదుట బాధితుల ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు


నర్సింలు (ఫైల్)

చేవెళ్ల: ఆపరేషన్ వికటించి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చేవెళ్లలో చోటుచేసుకుంది, పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కేసారానికి చెందిన కల్లెంల నర్సింలు (50) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఇతనికి కడుపులోని బొడ్డు వద్ద గడ్డ ఉందని వైద్యులు గుర్తించారు. ఈక్రమంలో గత బుధవారం విజయ్ నర్సింగ్‌హోంకు వెళ్లి డాక్టర్ విజయ్‌కుమార్‌ను కలిశాడు. చిన్న ఆపరేషన్ ద్వారా తొలగించేద్దామని చెప్పడంతో ఆస్పత్రిలో చేరాడు. సాయంత్రం వేళ శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం నర్సింలు నోరు తడి ఆరిపోతోందని, పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు డాక్టర్‌కు చెప్పారు. ఏమీ కాదని చెప్పిన ఆయన గ్లూకోజ్ పెట్టినా, ఎక్కక పోవడంతో అనుమానం వచ్చి మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నర్సింలు చనిపోయాడని ఆరోపిస్తూ అతని బంధువులు మృతదేహంతో వచ్చి విజయ్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పటికే డాక్టర్లందరూ వెళ్లిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం బాడీని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం

షాద్‌నగర్‌రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ హోటల్ దగ్ధమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలిచంద్రయ్య హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధిని పొందుతున్నాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే హోటల్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తరువాత షార్ట్ సర్క్యూట్ కావడంతో హోటల్‌లోని సామగ్రి, వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. గురువారం తెల్లవారుజామున చంద్రయ్య చూడగా దట్టమైన పొగతో నిండిపోయింది. హోటల్‌లోని ఫ్రిడ్జ్‌లు, కౌంటర్‌లు, కంప్యూటర్, ప్రింటర్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, ఫ్యాన్‌లు, కుర్చీలు, కూల్ డ్రింక్, వాటర్ బాటిళ్లు పూర్తిగా కాలిపోయాయి. విషయాన్ని తెలుసుకున్న ఆర్‌ఐ సలీం, పంచాయతీ కార్యదర్శి తేజస్విని ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు హోటల్ యజమాని చంద్రయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.


కాలిపోయిన సామగ్రి

ఆలయంలో బంగారు నగల చోరీ


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు తదితరులు

యాచారం: మండల పరిధి నక్కిసింగారంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండగులు దేవాలయంలోని తలుపులను పగులగొట్టి దేవతా మూర్తుల మెడలో ఉన్న రూ.లక్ష లోపు విలువ జేసే బంగారు ఆభరణాలు, హుండీలో ఉన్న నగదును అపహరించారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ మధులు సీతా రామాంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి చోరీకి పాల్పడిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

'అవాస్తవాల ప్రచారం సరికాదు'

ఇబ్రహీంపట్నం: తాను కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ప్రచారం చేయడం సరికాదని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నట్లు చెప్పారు. తనపై ఉద్దేశపూర్వకంగా కొందరు అవాస్తవాలు ప్రచారం చేసి, కార్మికులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు సూచనల మేరకే వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద బాధిత రైతు

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చర్లగూడలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నక్కల కిష్టయ్యకు చెందిన ఆవు మేత మేస్తూ మీరాపూర్ సమీపంలో విద్యుత్ టాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

త్వరితగతిన ఎస్టీపీల పనులు

సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీపీల పనుల్లో వేగంపెంచి తుదిదశలో ఉన్న వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. తొలుత అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చిన్న చిన్న సివిల్ వర్క్‌లు, గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణంలాంటి పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం అత్తాపూర్ ఎస్టీపీని సైతం సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించిన ఎండీ మిగిలిపోయిన పనుల్ని సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

12 గంటలు సోదాలు

- ఇబ్రహీంపట్నం తహసీల్ కార్యాలయంలో అర్ధరాత్రి వరకు ఏసీబీ తనిఖీలు
- ఫోన్ సంభాషణల ఆధారంగా ఆర్‌ఐ రిమాండ్
- అధికారవర్గాల్లో కలకలం రేపిన దాడులు


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: అవినీతి ఆరోపణలతో ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయంలో దాదాపు 12 గంటల పాటు విచారణ కొనసాగింది. బుధవారం తహసీల్ కార్యాలయానికి ఏసీబీ అధికారులు మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి అర్ధరాత్రి 2 గంటల వరకు అక్కడే మకాం వేశారు. ఆర్డీఓ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు వారితోనే ఉన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన కృష్ణను విచారించి అర్ధరాత్రి రెండు గంటలకు నగరానికి తరలించారు. అనంతరం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో ఆయన్ని హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్‌తోపాటు సిబ్బంది సుదీర్ఘ సమయాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేస్తూ గడపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆదిభట్లలోని 355 సర్వేనంబర్ భూమితో పాటు పలు రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. రెడ్ హ్యాండెడ్‌గా ఆర్‌ఐ కృష్ణ పట్టుబడనప్పటికీ.. ఫిర్యాదుదారుడు అందజేసిన మొబైల్ ఫోన్ రికార్డుల ఆడియో ద్వారా సేకరించిన ఆధారాలతో అరెస్టు చేశారు.

ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరా

ఆదిభట్లలోని 355 సర్వేనంబర్‌లోని ఏడు గుంటల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించే వ్యవహారంలో ఏసీబీకి ఆర్‌ఐ కృష్ణ చిక్కారు. ఆ పట్టాదారుడి ఎకరా 16 గుంటల భూమి ఆ సర్వేనంబర్‌లో ఉండగా.. కేవలం 7 గుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఇందుకు రూ.12 లక్షలు ఆర్‌ఐ కృష్ణ డిమాండ్ చేయగా రూ.9 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరినట్లు ఆరోపణలున్నాయి. 15 రోజుల క్రితం 7 గుంటల భూమిని సంబంధిత పట్టాదారుడి పేరుపై రికార్డుల్లో అధికారులు నమోదు చేశారు. ఈ తతంగం ముగిసిన అనంతరం ఒప్పందం మేరకు రావాల్సిన డబ్బుల గురించి పట్టాదారుడి కుటుంబసభ్యులను ఆర్‌ఐ కృష్ణ డిమాండ్ చేయడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్ర ఏమైన ఉందా అనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారుల విచారణలో ఆర్‌ఐ నోరు విప్పితేనే ఈ అంశంలోని పాత్రదారులు ఎవ్వరనేది స్పష్టం కానుంది.

ఎక్కడ చూసినా ఇదే చర్చ

ఏసీబీ దాడులతో అధికార వర్గాల్లో కలకలం రేగింది. బుధ, గురువారాల్లో ఇదే చర్చ నియోజకవర్గంగా జోరుగా కొనసాగింది. పట్టుబడిన ఆర్‌ఐ కృష్ణను విచారించే క్రమంలో ఇంకా ఎవరి పేర్లైనా వెల్లడిస్తాడేమోనన్న భయం రెవెన్యూ అధికారులకు పట్టుకుంది. ఈ దాడులతో వివిధ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందిలో సైతం భయాందోళనలు నెలకొన్నాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం తహసీల్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి చేసి అప్పటి ఓ సర్వేయర్‌ను పట్టుకున్న అనంతరం తిరిగి ఇప్పుడు జరిగిన దాడుల్లో ఆర్‌ఐ చిక్కడం హాట్ టాపిక్‌గా మారింది.


కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు (ఫైల్)

గస్తీ బృందాలకు కొత్త ట్యాబ్స్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గస్తీ విధులు నిర్వర్తించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ మొబైల్ బృందాలకు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ కొత్త ట్యాబ్‌లు మంజూరు చేశారు. కొన్నేళ్ల క్రితం వీటికి కేటాయించినవి ప్రస్తుతం మరమ్మతులకు లోనవుతుండటంతో కొత్తగా 206 ఖరీదు చేశారు. వీటిని గురువారం కొత్వాల్ సిబ్బందికి అందించారు. అలాగే కొత్తగా ఏర్పాటైన టోలిచౌకి పోలీసుస్టేషన్‌కు అవసరమైన సాంకేతిక ఉపకరణాలను అందించారు.

మత్తు మందిచ్చి లైంగిక దాడి.. ఆపై బ్లాక్‌మెయిల్

బంజారాహిల్స్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువకుడు లంచ్‌కు తన ఇంటికి వచ్చిన యువతికి మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లో నివసించే మహేంద్రవర్ధన్ అనే యువకుడికి ఫేస్‌బుక్‌లో ఓ యువతి పరిచయమైంది. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థినని మహేంద్ర ఆమెను పరిచయం చేసుకున్నాడు. 2023 ఆగస్టు 15న ఇద్దరూ కలిసి మహేంద్ర ఇంటికి లంచ్ కోసం వచ్చారు. ఆ సమయంలో ఆమెకు మత్తు మందు ఇవ్వడంతో నిద్రలోకి జారుకుంది. అదే సమయంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మెళకువ వచ్చి చూసుకునేసరికి బాధితురాలు జరిగిన విషయాన్ని గమనించి షాక్‌కు గురైంది. ఈ విషయంలో మహేంద్రవర్ధన్ కొంతకాలంగా ఆమెను బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. దీంతో ఆమె రూ.20 లక్షల వరకు చెల్లించుకుంది. ఫోటోలు బయటపెడతానని, బంధువులు అందరికీ తెలియజేస్తానని రోజురోజుకు నిందితుడి వేధింపులు పెరిగిపోవడంతో పాటు ఇటీవల రూ. కోటి ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై బీఎన్‌ఎస్ 64(1), 308 (2), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువ క్రీడాకారుడు సాయివర్ధన్‌కు సత్కారం

సాక్షి, సిటీబ్యూరో: ఒలంపిక్స్‌లో పతాకం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు జవాజి సాయివర్ధన్‌కు భరోసా ఇచ్చారు. ఈ నెల 4 నుండి 15 వరకు బీహార్ రాష్ట్రంలోని రాజగిరిలో నిర్వహించిన జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించి వెయిట్ లిఫ్టింగ్ 89 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన సాయివర్ధన్ గురువారం కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. బంగారు పతకం సాధించినందుకు సాయి వర్ధన్‌కు అభినందనలు తెలిపి శాలువతో సత్కరించారు.

రూ.11 లక్షలకు రైతుబజార్ వేలం


వేలంలో దక్కించుకున్న మహ్మద్ అలీ

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ రైతుబజార్ వేలంలో రూ.11,03,500కు పలికింది. మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్ రామ్ సమక్షంలో గురువారం నిర్వహించిన ఈ వేలంలో ఆరుగురు సీహెచ్ నవీన్ గౌడ్, మహ్మద్ అలీ, ఎస్.కె.అమీర్, బి.నాగభూషణం, ఎండీ జమీయువద్దీన్‌లు ముందుకు రావడంతో వేలం నిర్వహించగా రూ.11,03,500లకు మహ్మద్ అలీ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రైతుబజార్ దక్కించుకున్న వారు వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు వీధి వ్యాపారుల వద్ద రుసుంను వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాము సూచించినంత మేరకే వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భానుచందర్, మహ్మద్ మస్తాన్ వలీ పాల్గొన్నారు.

బెదిరిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

ఫిలింనగర్: నన్ను కాదంటే నువ్వు పెళ్లి ఎలా చేసుకుంటావో చూస్తానంటూ బెదిరించిన మాజీ ప్రియుడిపై ఓ యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే ప్రముఖ డిజైనర్ (26) ఓ బొటిక్ నడుపుతున్నది. ఆమెకు 2024లో అభిలాష్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. అయితే ఇద్దరూ కొన్ని కారణాల వల్ల విడిపోయారు. అప్పటి నుంచి నిందితుడు అభిలాష్ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. ఆమె ఫొటోలను స్నేహితులకు పంపుతూ ప్రతిష్టను దిగజార్చసాగాడు. ఆమె ఫ్లాట్ వద్ద అనుమానాస్పదంగా తిరగడంతో పాటు జుమాటో డెలివరీ బాయ్‌గా అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశిస్తూ ఆమె ఫ్లాట్ వద్దకు వచ్చి డెలివరీ ఆర్డర్ తీసుకోవాలంటూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె రెండు రోజుల క్రితం అభిలాష్ సోదరుడి దృష్టికి తీసుకువెళ్లింది. వారు పట్టించుకోలేదు. తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ అభిలాష్ మళ్లీ బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడసాగాడు. నిందితుడి వల్ల తాను బొటిక్ నడపలేకపోతున్నానని, వ్యాపారం దెబ్బతిన్నదని, పూర్తి నష్టాల్లో ఉన్నానని, తన పెళ్లి కూడా ఇతని చేష్టల వల్ల ఇబ్బందులకు గురవుతున్నదని ఆరోపిస్తూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడు అభిలాష్‌పై బీఎన్‌ఎస్ సెక్షన్ 78 (2), 336 (4), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పెళ్లి చేసుకోపోతే సూసైడ్ చేసుకుంటానంటూ బెదిరింపు

ఫిలింనగర్: తనను పెళ్లి చేసుకోపోతే సూసైడ్ చేసుకుంటానంటూ ఓ యువకుడు బెదిరించడమే కాకుండా ఆమె కళ్లముందే బ్లేడ్‌తో చేతిని కట్ చేసుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ ఎల్‌ఎన్ నగర్‌లో నివసించే యువతి (24) జూబ్లీహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తోంది. రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్ వెంకటగిరికి చెందిన ఎస్.అరవింద్ అనే దూరపు బంధువుతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా..వారి పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో రెండు కుటుంబాలు ఒప్పుకోకపోతే తాను పెళ్లి చేసుకోనని యువతి చెప్పింది. ఆగ్రహించిన అరవింద్ గత మూడు నెలలుగా ఆమెను పెళ్లి చేసుకోవాలంటూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె తిరస్కరిస్తూ వస్తున్నది. దీంతో ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి వద్దకు కూడా రోజూ వెళ్తూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయసాగాడు. బుధవారం రాత్రి ఆమె విధులు ముగించుకుని ఆస్పత్రి పార్కింగ్ స్థలంలోకి వచ్చి స్కూటీ తీసుకుంటుండగా, అక్కడికి వచ్చిన అరవింద్ ఆమెను అడ్డుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని మరోసారి ఒత్తిడి చేశాడు. ఆమె కుదరదని చెప్పడంతో జేబులో ఉన్న బ్లేడ్ తీసి చేతిని కోసుకున్నాడు. తనను పెళ్లి చేసుకోకపోతే ఇక్కడే సూసైడ్ చేసుకుంటానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 78 (2), 351 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెయిన్‌బో ఆస్పత్రి చైర్మన్ పేరుతో సైబర్ మోసానికి యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ చైర్మన్ పేరుతో అదే సంస్థకు చెందిన సీఎఫ్‌ఓకు రూ.20 లక్షలు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ రాగా, ఆయన చాకచక్యంగా వ్యవహరించి సైబర్ మోసానికి కళ్లెం వేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే...బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ సీఎఫ్‌ఓ వికాస్ మహేశ్వరికి ఇటీవల సంస్థ సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల పేరుతో ఓ వాట్సప్ మెసేజ్ వచ్చింది. తనకు రూ.20 లక్షలు పంపించాలని, ఓ బ్యాంక్ అకౌంట్ ఖాతాను కూడా పంపించాడు. అయితే ఈ బ్యాంక్ అకౌంట్ రాంచీలోని కిషోర్‌గంజ్ బ్యాంక్ నుంచి వచ్చింది. వాట్సప్ నెంబర్ కూడా తన చైర్మన్‌ది కాకపోవడంతో వికాస్ మహేశ్వరి లోతుగా ఆరాతీశాడు. బ్యాంక్ అకౌంట్‌తో పాటు తన చైర్మన్ ఫోన్ నెంబర్ కూడా వేరేగా ఉండటంతో అనుమానం వచ్చి వెంటనే రమేష్ కంచర్లకు ఫోన్ చేసి మీరు డబ్బులు పంపించాలని మెసేజ్ చేశారా? అని అడిగాడు. తాను ఎలాంటి మెసేజ్ చేయలేదని ఆయన చెప్పడంతో ఇది సైబర్ మోసమని గ్రహించిన వికాస్ మహేశ్వరి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న వ్యక్తి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

బంజారాహిల్స్: తన కుమారుడి స్నేహితుడి తండ్రి నుంచి ప్రాణహానితో పాటు మానసిక వేధింపులు ఎక్కువవుతున్నాయని, చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... శ్రీనగర్‌కాలనీ సమీపంలోని ప్రగతినగర్‌లో నివసించే డిజైనర్ (39)కి బంజారాహిల్స్‌లో ఓ బొటిక్ ఉంది. ఆమె కుమారుడు జూబ్లీహిల్స్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. కుమారుడి స్నేహితుడు తండ్రి మురళి ఆమె ఫోన్ నెంబర్ తీసుకుని తరచూ ఆమెతో మాట్లాడసాగాడు. ఇది పద్ధతి కాదని పలుమార్లు ఆమె హెచ్చరించి నెంబర్‌ను బ్లాక్ చేసింది. అయితే ఈ నెల 17వ తేదీన బొటిక్ మూసి ఇంటికి వెళ్తుండగా రాత్రి 8.30 గంటల సమయంలో నిందితుడు మురళి ఆమె ఇంటి సమీపంలో వాహనం ఆపి తన నెంబర్‌ను ఎందుకు బ్లాక్ చేశావంటూ నిలదీశాడు. అన్‌బ్లాక్ చేయాలని హెచ్చరించాడు. ఎలాగోలా నిందితుడి నుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు రాత్రి కూడా మురళి ఆమెను దారికాసి అడ్డుకుని ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను, స్కూటీ తాళం చెవులను తీసుకుని ముందుకు వెళ్లకుండా చేశాడు. బతిమిలాడిన ఆమె తాళం చెవులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. ఈ నెల 24 నుంచి 27వ తేదీ మధ్యలో నిందితుడు ఆమెకు వాట్సప్‌లో అసభ్యకర సందేశాలు పంపాడు. ప్రవర్తన నచ్చకపోవడంతో మళ్లీ నెంబర్ బ్లాక్ చేసి విషయం భర్త దృష్టికి తీసుకువెళ్లింది. తనను వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోవాలో క్యాసినో సెక్యూరిటీ గార్డు హత్య

స్వల్ప వివాదం నేపథ్యంలో చంపేసిన నగర వాసి
- నిందితుడు మైలార్‌దేవ్‌పల్లి రాణా రౌడీషీటర్ అల్తాఫ్
- దబోలిం ఎయిర్‌పోర్టు దారిలో పట్టుకున్న పనాజీ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: పేకాట కోసం హైదరాబాద్ నుంచి గోవా వెళ్లిన ఓ రౌడీషీటర్ బుధవారం అర్ధరాత్రి రెచ్చిపోయాడు. పనాజీలోని కంపాల్‌లో ఉన్న ఓ క్యాసినోలో వీరంగం సృష్టించాడు. స్వల్ప వివాదం నేపథ్యంలో విచక్షణ కోల్పోయి కత్తితో సెక్యూరిటీ గార్డులపై విరుచుకుపడ్డాడు. ఈ ఉదంతంలో ఓ సెక్యూరిటీ గార్డు చనిపోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోవా నుంచి పారిపోవడానికి దబోలిం విమానాశ్రయానికి వెళ్తుండగా సదరు రౌడీషీటర్‌ను పనాజీ పోలీసులు మార్గమధ్యంలో గురువారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. చార్మినార్‌లోని మిశ్రీగంజ్‌కు చెందిన అబ్దుల్ అల్తాఫ్‌కు నేరచరిత్ర ఉంది. ఈ నేపథ్యంలోనే ఇతడిపై సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రౌడీషీట్ తెరిచారు. పేకాట కోసం తరచు గోవా వెళ్లివచ్చే ఇతగాడు రెండు రోజుల క్రితం అలానే వెళ్లాడు. బుధవారం రాత్రి గోవా రాజధాని పనాజీలోని కంపాల్‌లో ఉన్న క్యాసినో కార్నివాల్ అనే క్యాసినోకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత స్వల్ప విషయమై క్యాసినో నిర్వాహకులతో అల్తాఫ్‌కు వివాదం ఏర్పడింది. యాజమాన్యం ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఆ క్యాసినో సెక్యూరిటీ గార్డులు అల్తాఫ్‌కు సర్దిచెప్పడంతో పాటు అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో విచక్షణ కోల్పోయిన అల్తాఫ్ క్యాసినోలోని ఇంటర్నల్ స్టెయిర్ కేస్‌కు సంబంధించిన బ్లస్టర్ (పక్కన ఉండే కర్ర) విరగ్గొట్టి, దాన్ని తీసుకుని సెక్యూరిటీ గార్డులపై దాడి చేశాడు. ఈ బ్లస్టర్‌కు కింది భాగంలో ఇనుప తొడుగు ఉండటంతో మధ్యప్రదేశ్ నుంచి వెళ్లి గోవాలో పని చేస్తున్న ధీరు శర్మ, సౌత్ గోవాలోని శిరోడాకు చెందిన సత్యం గోవాన్కర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సహచర సెక్యూరిటీ గార్డులు బాంబోలింలోని గోవా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ధీరు శర్మ చనిపోగా... సత్యం పరిస్థితి విషమంగా ఉంది. అదును చూసుకుని ఆ క్యాసినో నుంచి బయటపడిన అల్తాఫ్ తాను బస చేసిన హోటల్ గదికి వెళ్లాడు. అక్కడ నుంచి తన లగేజీ తీసుకుని నార్త్ గోవాలోని దబోలిం విమానాశ్రయానికి బయలుదేరాడు. విషయం పోలీసుల వద్దకు వెళ్లి, కేసు నమోదయ్యే లోపు హైదరాబాద్ వచ్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలని భావించాడు. క్యాసినో కార్నివాల్‌లో జరిగిన ఈ ఘాతుకంపై గురువారం తెల్లవారుజామున 3.10 గంటలకు పనాజీ పోలీసులకు సమాచారం అందింది. తక్షణం అప్రమత్తమైన నార్త్ గోవా ఎస్పీ రాహుల్ గుప్తా నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. క్యాసినోలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడు అల్తాఫ్‌గా గుర్తించారు. అతడు విమానాశ్రయానికి వెళ్తున్నాడని తెలుసుకుని మార్గమధ్యంలో అరెస్టు చేశారు. ఈ నేరాన్ని లోతుగా దర్యాప్తు చేస్తున్న గోవా పోలీసులు అల్తాఫ్ అక్కడకు ఎందుకు వచ్చాడు? వివాదానికి కారణం ఏంటి? అనే విషయాలు ఆరా తీస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
మన తెలంగాణ మరియు ఆంధ్ర రెండు తెలుగు రాష్ట్రాలలో ఫామ్ ల్యాండ్ శ్రీగంధం మొక్కలతో 1/2 అర ఎకరము కేవలం 12.50 లక్షలు మాత్రమే. Ph: 9177619716 [HA-15181]

PLOT FOR SALE
Pay 50% Reg, Emi 2500 near Intl Airport Shadnagar DTCP 5500 Shankarpally, Sangareddy, Choutuppal near Gajwel 4000 Ph : 8978181683 [H-800531]

Services

BUSINESS SERVICE
మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800533]

PERSONAL CARE

CHANGE OF NAME
My Daughter, DARSHIE VASWANI, age 9 years, Student of Class 4th, shall henceforth be known as DARSHI K VASWANI. Kukatpally, 30-04-2025 KISHORE VASHDEV VASWANI [HA-12054]

I, Alakuntla Upendar S/o Alakuntla Balaiah R/o G-2, Meenakshi residency, Bandari layout, Nizampet, Hyderabad. I Have changed My Minor Son's Name From Alakuntla Kalyan to Alakuntla Manvith. [HA-12055]

OLD AGE HOME
జయశ్రీ హోంకేర్ వృద్ధులను పేషెంట్లను బేబీకేర్ చూసుకొనుటకు కేర్ టేకర్స్‌ను పంపబడును. ఫోన్ : 9398155291 [HA-15182]

వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & బోడుప్పల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783376]

Wanted

క్రమశిక్షణ కలిగిన రిటైర్డ్ డ్రైవర్ ఫ్యామిలీ కారు నడపడానికి కావాలి. ఎల్.బి.నగర్, ఆర్.టి.సి. కాలనీ సమీపంలోని నివాసితులు మాత్రమే సంప్రదించాలి. ఫోన్ : 9014094488 [H-1266480]

కారు డ్రైవర్ కావలెను. 4-5 సం.ల అనుభవం, Age: 35 సం.ల లోపు, మంచి జీతం, వసతి+భోజనం+2 వీలర్ సౌకర్యం కలదు. కోకాపేట, Hyd. 7416396781 [HA-15179]

ప్రముఖ కార్పొరేట్ కం॥లో ఫిక్స్‌డ్ శాలరీపై వర్క్ చేయుటకు లేడీ టెలి కాలర్స్ & రిసెప్షనిస్ట్ కా. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ must. ఏజ్: 18-35 సం॥లు. Qly: PG Only. 8179721155 [SCA25004298]

రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబీకేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16-18 వేలు ఫోన్: 9133271122/ 9515119430 [SCA25004282]

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్ టైం అడ్వయిజర్స్ కావలెను. పెన్షన్ పాలసీల కొరకు హౌస్ వైఫ్స్, రిటైర్డ్ వారు. Ph: 9849248282 [SCA25003701]

FACULTY TEACHERS
High School (EM) Teachers, PS, NS, & Primary : English, Maths & EVS, Cook : Ph : 6300197629, 9701726523 [HA-1357]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453